

కుశల సంకల్పం
కులగణనను శుక్రవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు చేపట్టనున్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎన్యూమరేటర్లను, సూపర్‌వైజర్లను నియమించారు. 8లో▸



ఎస్‌ఐలకు స్థానచలనం
డీఐజీ సెంథిల్ కుమార్ ప్రతిపాదనల మేరకు ఉమ్మడి జిల్లాలో 22 మంది ఎస్‌ఐలకు గురువారం స్థానచలనం కల్పించారు. కొందరిని వీఆర్‌కు, మరికొందరిని స్టేషన్లకు బదిలీ చేశారు. 8లో▸



విజయవంతం చేద్దాం
మార్చి 1 నుంచి 11 వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని శ్రీశైల దేవస్థానం చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

అర్హులందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు

నంద్యాలటౌన్: జిల్లా వ్యాప్తంగా అర్హులందరికీ నూతన ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్నామని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రూపేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 5.35 లక్షల మంది ఆరోగ్యశ్రీ కార్డుదారులు ఉన్నారన్నారు. వారిలో ఇప్పటి వరకు 29,351 మందికి నూతన ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేశామన్నారు. నూతన కార్డుల్లో ప్రత్యేక యూహెచ్ఐడీ నంబరు, క్యూఆర్ కోడ్ కూడా ఉండటంతో రోగి వివరాలు, గతంలో అందించిన చికిత్స వివరాలు సులభంగా తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు పరిమితిని రూ. 25 లక్షలకు పెంచడం వల్ల మరింత పేదలకు మెరుగైన వైద్య సేవలు పొందే సౌలభ్యం కలిగిందన్నారు. సచివాలయం పరిధిలో వలంటీరు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల ద్వారా నూతన ఆరోగ్యశ్రీ కార్డులు పొందవచ్చన్నారు.

డీఎంహెచ్ఓకు పదోన్నతి

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. రామగిడ్డయ్యకు పదోన్నతి లభించింది. విశాఖపట్నం ప్రాంతీయ ఆరోగ్య సంచాలకులు (రీజనల్ డైరెక్టర్)గా ఆయనను నియమిస్తూ వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర సంచాలకులు(డీహెచ్) ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన కర్నూలు డీఎంహెచ్ఓగా 2020 ఫిబ్రవరి 26న బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సేవలందించారు. రామగిడ్డయ్యకు పదోన్నతి లభించడం పట్ల వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రామ్ అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

ఉర్దూ యూనివర్సిటీ నేటి నుంచి పునఃప్రారంభం

కర్నూలు(న్యూటౌన్): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఈ నెల 19 నుంచి పునఃప్రారంభం కానుంది. సంక్రాంతి పండగ సందర్భంగా ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో 19వ తేదీ శుక్రవారం నుంచి యథావిధిగా వర్సిటీ పని చేయనున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.

శిక్షణలో జిల్లా పోలీసుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన పోలీసులకు మెమొంటో అందజేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: విశాఖపట్నంలో నిర్వహించిన యాంటి ఎక్స్‌ట్రిమిస్ట్ ట్రైనింగ్ ప్రొగ్రాంలో నంద్యాల జిల్లా పోలీసులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది నవంబర్ 18 నుంచి ఈ ఏడాది జనవరి 2వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించిన ట్రైనింగ్ ప్రొగ్రాంలో నంద్యాల జిల్లా నుంచి ఐదుగురు స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారన్నారు. మావోయిస్టుల కదలికలు, కూంబింగ్ సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫైరింగ్ తదితర విభాగాల్లో 45 రోజుల పాటు శిక్షణ పొందారన్నారు. శిక్షణలో భాగంగా బెస్ట్ ఇండోర్ విభాగంలో ఎం. ప్రదీప్ నాయక్ అత్యంత ప్రతిభ కనపరచగా, ఓవరాల్ ఛాంపియన్ షిప్‌లో ఎం. యువరాజు రెండవ స్థానంలో నిలిచారన్నారు. ఈ శిక్షణలో వారు నేర్చుకున్న మెలకువలను జిల్లాలోని మొబులైజేషన్ కార్యక్రమంలో పోలీసు సిబ్బందికి అవగాహన కల్పిస్తారన్నారు. అనంతరం వారిని ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.



రన్‌వే పై ఎగురుతున్న విమానం



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విమానాశ్రయాన్ని ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్ (ఫైల్)

నాడు గాలి మాటలు
నేడు విచ్చుకున్న రెక్కలు

- ఆకాశయాన కలను నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్
- సీమ ముఖ ద్వారం నుంచి ప్రముఖ నగరాలకు విమానాలు
- ఇప్పటి వరకు లక్ష మందికి పైగా ప్రయాణం
- చంద్రబాబు హయాంలో అంతా హడావుడి
- పనులు పూర్తిచేయకుండానే ప్రారంభోత్సవం
- రూ.240 కోట్లతో పనులు పూర్తి చేయించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- అనుమతులు తీసుకురావడంతో తిరుగుతున్న విమానాలు

మాట ఇవ్వడం.. దానిని నిలుపుకోలేకపోవడం.. ఆ తర్వాత బొంకడం.. హంగామా చేయడం.. అసత్యాలు ప్రచారం చేయించడం.. టీడీపీ అధినేత చంద్రబాబుకే చెల్లింది. ఓర్వకల్లు ఎయిర్ పోర్టు విషయంలో ఇది రుజువైంది. ఐదేళ్ల పాటు అధికారంలో ఉండి.. పనులు పూర్తి చేయించలేకపోయారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చలేకపోయారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. మాట ఇవ్వకుండానే ప్రజల ఆకాంక్షను నెరవేర్చారు. ప్రత్యేక చొరవ తీసుకుని 'ఘన' విహారానికి మార్గం సుగమం చేశారు. రేనాటి వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరుతో ఎయిర్ పోర్టును జాతికి అంకితం చేసి ఈ ప్రాంత ఔన్నత్యాన్ని చాటిచెప్పారు. ఏటా వేలాది మంది ప్రజలు విమానయాన సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు.



కర్నూలు విమానాశ్రయం

ఇది కదా.. అభివృద్ధి

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో ఎయిర్‌పోర్టు నిర్మాణం.. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఉన్న డిమాండ్. ఈ డిమాండ్‌కు దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీవం పోశారు. ఎయిర్ పోర్టు నిర్మాణానికి కర్నూలు జిల్లాలో భూసేకరణకు అనుమతులు ఇచ్చారు. అయితే మహానేత మరణం తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఈ అంశాన్ని పట్టించుకోలేదు. అయితే 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ..కర్నూలు 20 కిలోమీటర్ల దూరంలో ఓర్వకల్లు సమీపంలోని 1,008 ఎకరాల్లో ఎయిర్ పోర్టు నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. అప్పట్లో టీడీపీ ఎమ్మెల్యేకి చెందిన కన్‌స్ట్రక్షన్ కంపెనీ టెండర్ దక్కించుకోవడం, భూసేకరణ, ఇతర పనుల కోసం 2018 వరకు కాలయాపన చేశారు. ఏడాది గడిచేలోపే 2019 సాధారణ ఎన్నికలు రావడంతో పనులు మళ్లీ అటకెక్కాయి. 2019 జనవరి నాటికి కేవలం 2.2 కిలోమీటర్ల రన్‌వే మాత్రమే పూర్తయ్యింది. మిగిలిన పనులన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. అయినా అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు తానే ఎయిర్‌పోర్టుకు నిర్మించాననే సంతేతాన్ని ప్రజల్లోకి పంపేందుకు 2019 జనవరి 18న ఎయిర్ పోర్టును ప్రారంభించి ఏప్రిల్ నుంచి విమానాలు తిరుగుతాయని ప్రకటించారు. దీంతో కర్నూలు ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. పనులు పూర్తి చేయకుండా విమానాలు ఎలా వస్తాయో తెలియక నెత్తినోరు కొట్టుకున్నారు.

వైఎస్ జగన్ సీఎం అయ్యాక ప్రత్యేక దృష్టి

2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించింది. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక కర్నూలు ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. పెండింగ్‌లోని అన్ని పనులను పూర్తి చేయించే బాధ్యతను ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి అప్పగించారు. ఆయన కలెక్టర్, ఎయిర్‌పోర్టు అథారిటీ, ఇతర అధికారులను సమన్వయపరుస్తూ ఏడాదిన్నరలో పనులన్నీ పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారు. రూ.240 కోట్లను అదనంగా విడుల చేయించారు. ప్యాసింజర్ టెర్మినల్ బిల్డింగ్, ఐదు ఫ్లోర్లతో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్, అడ్మిన్ బిల్డింగ్, పోలీసు బ్యారక్, ప్యాసింజర్ లాంజ్, వీవీపీ లాంజ్, సబ్‌స్టేషన్, వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకు తదితర పనులన్నీ యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయించారు. అంతేకాక కర్నూలు విమానాశ్రయానికి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్, డీజీసీఏ అనుమతులను తెప్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం కీలకంగా వ్యవహరించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పలుమార్లు ఢిల్లీకి వెళ్లి అనుమతులు వచ్చేలా చేశారు. 2019లో ఏటీసీ, 2020 జనవరి 16 కీలకమైన డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) అనుమతులు లభించాయి. ఎరోడ్రోమ్ లైసెన్స్‌ను మంజూరు చేస్తూ న్యూఢిల్లీలోని డీజీసీఏ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి 2021 మార్చి 21న ఎయిర్‌పోర్టును ప్రారంభించి జాతికి అంకితంచేశారు. అంతేగాక ఈ విమానాశ్రాయానికి రేనాటి వీరుడు, బ్రిటీషర్లను గడగడలాడించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పేట్టారు. మార్చి 28 నుంచి విమానాలు తిరుగుతాయని ప్రకటించారు. చెప్పిన దాని ప్రకారం 2021 మార్చి 28 నుంచి నేటి వరకు కర్నూలు ఎయిర్ పోర్టునుంచి నిర్విరామంగా విమాన ప్రయాణాలు కొనసాగుతున్నాయి.

త్వరలోనే పైలెట్ శిక్షణ కేంద్రం



త్వరలోనే కర్నూలు నుంచి తిరుపతి, విజయవాడలకు విమానాలు నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఇండిగో విమానసంస్థతో మాట్లాడాం. త్వరలోనే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఎయిర్‌పోర్టులో రాష్ట్రంలోనే తొలి పైలట్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. దీనికి సంబంధించి నెలాఖరులోపు టెండర్లు ఖరారయ్యే అవకాశం ఉంది. ఎయిర్‌పోర్టు చుట్టూ 400 ఎకరాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు వివిధ అభివృద్ధి పనులు చేపట్టబోతున్నాం. ప్రయాణికుల రద్దీని బట్టి విమానాలను నడుపుతున్నాం. విమాన చార్జీలు ఎక్కువ కాకుండా అన్ని వర్గాల వారికి అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.
– భరత్‌రెడ్డి, ఎండీ, ఏపీ విమానయాన సంస్థ

సమయం కలసి వస్తోంది



నేను వృత్తి రీత్యా బిల్డర్‌ను. తరచూ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన సామగ్రిని కొనుగోలు చేయడానికి బెంగళూరు వెళ్లాల్సి ఉంటుంది. రైలు, బస్సు, ఇతర వాహనాల ద్వారా వెళ్లాలంటే దాదాపు 6 గంటలపాటు ప్రయాణం చేయాల్సి ఉండేది. అయితే ప్రస్తుతం కర్నూలు నుంచి విమానం ద్వారా బెంగళూరుకు గంటలోపే చేరుకుంటున్నాం. దీంతో సమయం కలసి వస్తోంది.
–వెంకట సుబ్బయ్య, వ్యాపార వేత్త, కర్నూలు

ఏడాదిన్నరలో లక్ష మందికిపైగా ప్రయాణం

కర్నూలు ఎయిర్‌పోర్టు నుంచి బెంగళూరు, చెన్నై, విశాఖపట్నాలకు వారానికి నాలుగు రోజులపాటు విమానాలు తిరుగుతున్నాయి. 2021–22 ఆర్థిక సంవత్సరంలో కర్నూలు నుంచి 33,159 మంది ప్రయాణికులు విమాన ప్రయాణం చేశారు. అలాగే 2022–23 ఆర్థిక సంవత్సరంలో 38,714 మంది ప్రయాణించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రయాణికుల వివరాలు కలుపుకుంటే ఆ సంఖ్య లక్షకు పైగా దాటుతుంది. కర్నూలు నుంచి విశాఖపట్నం దాదాపు 700 కిలోమీటర్ల దూరం ఉండగా బస్సులు, ఇతర వాహనాల ద్వారా 15 గంటల ప్రయాణ సమయం పడుతుంది. విమానం ద్వారా కర్నూలు నుంచి విశాఖపట్నంకు 2.10 గంటల్లో చేరుకోవచ్చు. కర్నూలు–బెంగళూరుల మధ్య 360 కిలోమీటర్ల దూరాన్ని ఆరు గంటల్లో చేరుకోనుండగా విమానం ద్వారా వెళ్తితే 1.05 గంటలకు వెళ్లవచ్చు. కర్నూలు–చెన్నైల మధ్య 494 కిలోమీటర్ల దూరం ఉండగా ప్రయాణ సమయం 8.45 గంటలు పట్టవచ్చు. అయితే విమానం ద్వారా 1.20 గంటల్లో చేరుకోవచ్చు. విమాన ప్రయాణ ఖర్చులు కూడా ప్రస్తుతానికి అన్ని వర్గాల ప్రజలకు అనువుగా ఉన్నాయి.

వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్తగా డాక్టర్ సుధీర్



నందికొట్కూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్తగా డాక్టర్ దారా సుధీర్‌ను నియమించారు. ఈ మేరకు గురువారం రాత్రి పార్టీ అధిష్టానం ఒక ప్రకటన విడుదల చేసింది. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో ఇంజినీర్‌గా పని చేసిన నాగభూషణం కుమారుడు డాక్టర్ దారా సుధీర్ ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు సున్నిపెంటలో విద్యనభ్యసించారు. అనంతరం ఎంబీబీఎస్ కర్నూలు మెడికల్ కళాశాలలో చదివారు. అదే కళాశాలలోనే ఎండీ కోర్సు కూడా పూర్తి చేశారు. 11 ఏళ్ల పాటు కర్నూలు నగరంలో వైద్య సేవలు అందించారు. అనంతరం హైదరాబాద్, చెన్నైలో ఎపివన్ పేరుతో పెయిన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించి వేలాది మందికి శస్త్రచికిత్సలు చేశారు. నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా తనకు అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సహకరించిన శాప్ రాష్ట్ర చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డికి డాక్టర్ దారా సుధీర్ కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో కుల, మతాలకు అతీతంగా సేవలు అందించి మన్ననలను పొందుతానన్నారు. సీఎం వైఎస్ జగనన్న ఆశయాలను నెరవేర్చే దిశగా పార్టీలో అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తానన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు.

రేపు 22 కేంద్రాల్లో 'నవోదయ' పరీక్ష

కర్నూలు కల్చరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 22 కేంద్రాల్లో శనివారం జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నట్లు డీఈఓ వెంకట రంగారెడ్డి తెలిపారు. గురువారం పరీక్ష నిర్వహణకు సంబంధించి పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు/సెంటర్ లెవల్ అబ్జర్వర్లకు అవగాహన సదస్సు ఏక్యాంప్‌లోని మాంటిస్సోరి స్కూల్‌లో నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 6,120 మంది విద్యార్థులు పరీక్ష రాయడానికి రిజిష్టర్ చేసుకున్నారన్నారు.

అభివృద్ధిలో అగ్రగామిగా డోన్



వెంకటాపురం చెరువు వద్ద టూరిజం రిసార్ట్స్ పనులను పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన



ఇండోర్ స్టేడియంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డితో క్రీడాకారులు

డోన్: విద్య, వైద్య, పర్యాటక, రవాణా, ఉపాధి కల్పన రంగాల్లో డోన్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపాలన్నదే తన ధ్యేయమని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వెంకటాపురం తుమ్మల చెరువు వద్ద రూ.2 కోట్లతో నిర్మిస్తున్న రెస్టారెంట్, గార్డెన్, బోట్ జెట్టి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల ముందు డోన్‌ను రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీనిచ్చి నిలబెట్టుకున్నారన్నారు. ఇప్పటికే విద్య, వైద్య రంగాలలో అనుకున్న దానికంటే డోన్‌లో అభివృద్ధి ఎక్కువగా జరిగిందన్నారు. రూ.3 కోట్లతో బేతంచెర్ల మండలం బిల్లస్వర్గం, ప్యాపిలి మండలంలో మరో రూ.3కోట్లతో వాల్మీకి గుహలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. వీటికి తోడు హంద్రీనీవా కాల్వ నీటి ద్వారా చెరువులను నింపి నియోజకవర్గంలో 10 వేల ఎకరాలను వచ్చే ఏడాది సాగులోకి తీసుకువస్తున్నామన్నారు. ప్యాపిలి మండలం వెంగళాంపల్లె, డోన్ మండలం వెంకటాపురం తుమ్మలచెరువుల్లో బోటు షికారు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు పర్యాటకులు సేద తీరేందుకు రెస్టారెంట్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

నియోజకవర్గంలో ప్రతిభా క్రీడాకారులను ప్రోత్సహించేలా టెన్నిస్, షటిల్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, క్రికెట్ క్రీడల్లో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని మంత్రి బుగ్గన తెలిపారు. డోన్ పట్టణంలోని బుగ్గన శేషారెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈ సందర్భంగా మంత్రి బుగ్గన, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్‌రెడ్డిలతో కలిసి కాసేపు షటిల్ ఆడారు. అనంతరం ఆర్అండ్‌బీ డీఈ ప్రసాద్‌రెడ్డి, ఏఈ శ్రీకాంత్‌రెడ్డితో సమావేశం నిర్వహించి ఈనెలాఖరులోపు క్లబ్ హౌస్, రెండు విద్యార్థుల వసతి గృహాలు, ఐటీఐలో విద్యార్థుల వసతిగృహంతో పాటు ప్రభుత్వాసుపత్రి, ఆధునిక కూరగాయల మార్కెట్ ప్రారంభోత్సవానికి తేదీ ఖరారు చేయాలని ఆయన ఆదేశించారు. మంత్రి వెంట రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు దొరపల్లె చిరంజీవి, కురుకుంద హరి, పార్టీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు పోస్టుపసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలేశునికి పుష్పోత్సవం

- అశ్వవాహనంపై విహరించిన ఆది దంపతులు
- స్వామిఅమ్మవార్లకు శయనోత్సవం, ఏకాంతసేవ
- శ్రీశైలంలో ముగిసిన సంక్రాంతి బ్రహ్మోత్సవాలు



ఉత్సవానికి పూలు, పండ్లు తీసుకొస్తున్న దేవస్థానం సిబ్బంది, భక్తులు



స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం క్షేత్రంలో పార్వతీ సమేత మల్లికార్జున స్వామివారికి వైభవంగా పుష్పోత్సవాన్ని నిర్వహించారు. సంక్రాంతి బ్రహ్మోత్సవాల చివరి రోజు స్వామిఅమ్మవార్లు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభమైన సంక్రాంతి బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. ఉత్సవాల ముగింపులో భాగంగా స్వామిఅమ్మవార్ల ఉత్సమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ అలంకార మండపంలో అశ్వవాహనంపై ఆశీనులను చేశారు. ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు ప్రత్యేక పూజాది హారతులిచ్చారు. అనంతరం కళాకారుల నృత్యాలతో, డప్పు వాయిద్యాలతో స్వామిఅమ్మవార్లకు ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. ఈ ఉత్సవంలో కళాకారుల నృత్యాలు, విన్యాసాలు, డప్పు వాయిద్యాలు, కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అశ్వవాహనంపై విహరించిన స్వామిఅమ్మవార్లను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

సంప్రదాయ బద్ధంగా పుష్పోత్సవం, శయనోత్సవం..

సంక్రాంతి పర్వదినం రోజున నూతన వధూవరులైన పార్వతీ, మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా కాగడాలు, ఎర్రగులాబీలు, తెల్లగులాబీలు, పసుపు గులాబీలు, ఎర్రమందారం, తెల్లమందారం, ముద్దమందారం, నందివర్ధనం, గరుడవర్ధనం, కనకాంబారాలు, సుగంధాలు(లిల్లీపూలు), పసుపు చేమంతి, ఊదా చేమంతి, తెల్లచేమంతి, ఎర్రగన్నేరు, తెల్లగన్నేరు, దేవగన్నేరు, ముద్దగన్నేరు మొదలైన 18 రకాల పుష్పాలు, బిల్వం, మువం, యాచిపత్రి మొదలైన పత్రాలతో స్వామిఅమ్మవార్లకు విశేషంగా అర్చించారు. అలాగే అరటి, తెల్లద్రాక్ష, నల్లద్రాక్ష, దానిమ్మ, కమల, యాపిల్, పైనాపిల్, జామ, ఖరూరం మొదలైన 9 రకాల ఫలాలు కూడా నివేదించారు. అనంతరం స్వామిఅమ్మవార్లకు ఏకాంతసేవ నిర్వహించి, శయనోత్సవం నిర్వహించారు. శయనోత్సవం కోసం ఆలయ ప్రాంగణంలోని స్వామిఅమ్మవార్ల శయన మందిరాన్ని విశేష పుష్పాలంకరణ చేశారు. ఆయా పూజా కార్యక్రమంలో శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్

- జిల్లాలో 10,760 మందికి రూ.84.44 లక్షల లబ్ధి
- కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



మెగా చెక్కును విడుదల చేస్తున్న కలెక్టర్ జిలానీ

నంద్యాల: పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నంద్యాల జిల్లాలో 10,760 మంది ఇళ్ల లబ్ధిదారులకు రూ.84.44 లక్షల వడ్డీ రీయింబర్స్‌మెంట్ లబ్ధిని చేకూర్చిందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు కింద 12.77 లక్షల మందికి రూ.4,500.19 కోట్ల బ్యాంకు రుణం అందించి అందులో ఈ దఫా అర్హులైన 4,07,323 మంది లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద రూ.46.90 కోట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని నంద్యాల కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, హౌసింగ్ అధికారులు, లబ్ధిదారులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కింద జిల్లాలో ఇప్పటి వరకు 37,488 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.132.07 కోట్ల రుణాలు అందించామన్నారు. అందులో అర్హులైన 10,760 మంది లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద రూ.84.44 లక్షలను జమ చేశామన్నారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులు తమ తోటి లబ్ధిదారులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. రూ.35 వేల చొప్పున అడ్వాన్స్ తీసుకోని వారు కూడా తీసుకునేలా వారికి తెలియజేయాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, హౌసింగ్ పీడీ తదితరులు లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు.

క్లుప్తంగా

ఊరూరికి దస్తగిరి స్వామి గుర్రం



దస్తగిరి స్వామి గుర్రాన్ని ములుగుందం నుంచి తీసుకెళ్తున్న దృశ్యం

ఆస్పరి: మండలంలోని ములుగుందం గ్రామం నుంచి దస్తగిరి స్వామి గుర్రం గురువారం వేడుకగా బయలు దేరింది. ఊరూరా తిరిగి ఫిబ్రవరి 26 తేదీలోపు ములుగుందం గ్రామం చేరుకుంటుంది. అనంతరం దస్తగిరి స్వామి ఉరుసు ప్రారంభం కానుంది. ఈ సంప్రదాయం కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతోంది. గ్రామంలోని దస్తగిరి స్వామి వంశస్తులు గుర్రం పెంపకం బాధ్యతను తీసుకుంటారు. అలాగే గుర్రం వెంట ఊరూరా తిరిగి ఉరుసు వివరాలు తెలియజేస్తారు. గురువారం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి గుర్రాన్ని దస్తగిరి స్వామి వంశస్తులు హాఫీజ్ రహంతుల్లా, రోషన్‌పీరా, శంషుద్దీన్, అబ్దుల్ సాహెబ్ తీసుకెళ్లారు. గ్రామంలో స్వామి గుర్రానికి భక్తులు పూజలు చేశారు. మండలంలోని ములుగుందం, పలకూరబండ,ఆదోని,కౌతాళం మండలాల్లోని ఇస్వి, ఉప్పరహల్, కడితోట, రొడూరు, మాంత్రికి, హానవాల్, బదినేహల్, నాగరహల్, గజ్జెళ్ల, వందవాగిలి తదితర గ్రామాల్లో గుర్రాన్ని ఊరేగించనున్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ఈనెల 20, 21 తేదీల్లో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ తైక్వాండో రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి గురువారం తెలిపారు. తైక్వాండో పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు ఫిబ్రవరి 2, 3 తేదీల్లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయపూర్‌లోజరిగే జాతీయ పోటీల్లో పాల్గొనడం జరుగుతుందన్నారు. అలాగే ఏపీ మహిళల తైక్వాండో ఎంపిక పోటీలు ఈనెల 20వ తేదీన ఇండోర్‌స్టేడియంలోని నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలు సీనియర్, జూనియర్ కేడెట్ విభాగాలుగా జరుగుతాయన్నారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన కర్ణాటక మద్యంతో సెబ్ అధికారులు

కౌతాళం: మద్యం అక్రమ రవాణాపై సెబ్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. భారీగా కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సెబ్ సబ్ ఇన్‌స్పెక్టర్ స్వామినాథ్ తెలిపిన వివరాల మేరకు.. ఎరిగేరి–తోవి గ్రామ క్రాస్‌రోడ్డు వద్ద ఎరిగేరి గ్రామానికి చెందిన పశువుల కేశవస్వామి, భీమేష్‌లు ద్విచక్ర వాహనాలపై 22 బాక్సుల్లో (2112) కర్ణాటక టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా పట్టుకున్నారు. రెండు వాహనాలను, మద్యం బాక్సులు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు. అలాగే బాపురం చెక్‌పోస్టు వద్ద ఆదోనికి చెందిన మాదిగ హనుమంతమ్మ వద్ద ఒక బాక్సు కర్ణాటక టెట్రా ప్యాకెట్లను పట్టుకుని కేసు నమోదు చేశారు.కుంబళనూరు గ్రామం వద్ద అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా రెండు ట్రాక్టర్లను పట్టుకుని రూ.20వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు. దాడుల్లో ఆదోని సెబ్, కర్నూలు సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

కుశల సంకల్పం

- నేటి నుంచి సమగ్ర కులగణన
- 28వ తేదీ వరకు నిర్వహణ
- 29 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు మిగిలిపోయిన కుటుంబాల వివరాల సేకరణ
- ఫిబ్రవరి 3 నుంచి 15వ తేదీ వరకు కులాల వివరాలు వెల్లడి
- ఎన్యుమరేటర్లుగా గ్రామ, వార్డు సచివాయాల ఉద్యోగులు, వలంటీర్లు
- వివరాలను సమగ్రంగా సేకరించేలా యాప్ రూపకల్పన

కర్నూలు(సెంట్రల్): సమాజంలో అట్టడుగు వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కులగణనకు పచ్చ జెండా ఊపింది. శుక్రవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు కులగణనను ఎన్యుమరేటర్లుగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు చేపట్టనున్నారు. దేశంలో చివరి సారిగా 1931లో కులగణన జరిగింది. అప్పటి నుంచి పదేళ్లకొకసారి జరిగే జనగణనలో ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల కుల వివరాలను మాత్రమే సేకరిస్తున్నారు. జనాభాలో అత్యధిక భాగం ఉన్న బీసీ కులాల వివరాలను సేకరించడం లేదు. బీసీ కులాల లెక్క తేల్చాలని, జనాభాకు అనుగుణంగా ఆయా కులాల అభ్యున్నతి కోసం చర్యలు తీసుకోవాలని ఆయా వర్గాల వారు దశాబ్దాల కాలంగా కోరుతున్నారు. దాదాపు 93 ఏళ్ల నుంచి వారి అభ్యర్థనను ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులగణన చేపట్టాలని నిర్ణయించడంపై హర్షం వ్యక్తమవుతోంది.

సమగ్రాభివృద్ధి

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కులాల వివరాలు ఉండడంతో వారికి సబ్ ప్లాన్‌ను అమలు చేస్తున్నారు. దీంతో వారు అధికంగా ఉండే గ్రామాలు, వాడల్లో అభివృద్ధి పనులను చేపడుతున్నారు. అయితే బీసీ కులాల వివరాలు లేకపోవడంతో బీసీ సబ్ ప్లాన్ అమలుకు అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి. అసలు బీసీలు ఏ గ్రామంలో, ఏ వాడలో అధికంగా ఉన్నారో తెలియడం లేదు. అదే సమయంలో బీసీల జనాభా వివరాలు లేకపోవడంతో స్థానిక సంస్థల పదవుల్లో రిజర్వేషన్లకు ఆటంకం ఉంది. వెనుకబడిన బీసీ ఉప కులాలను వృద్ధి పథంలో తేవడానికి అవసరమైన సంక్షేమ పథకాలు, అభివృద్ధికి చర్యలు తీసుకోవడానికి సరైన కులాల లెక్కలు లేవు. కుల గణన పూర్తి అయిన తరువాత వెనుకబడిన కులాలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రాధాన్యతను కల్పించేందుకు అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో కొందరు కులగణనకు సహకరించొద్దని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిలిపివేస్తారని అపోహలు సృష్టిస్తున్నారు. అలాంటి వారి మాటలను ఎవరూ నమ్మొద్దని అధికారులు సూచిస్తున్నారు. కులగణనతో సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని చెబుతున్నారు.

కుటుంబ యజమానితో ఈకేవైసీ

కులగణనలో భాగంగా ఎన్యుమరేటర్లు నేరుగా ప్రజల ఇళ్ల వద్దకు వస్తారు. ఆ సమయంలో వారికి కుటుంబ సభ్యుల వివరాలు, ఇతర వివరాలను కుటుంబ పెద్ద లేదా ఎవరైనా తెలియజేయాల్సి ఉంటుంది. ఎన్యుమరేటర్లు అన్ని వివరాలను యాప్‌లో నమోదు చేసుకొని మొదట వారు ఈకేవైసీ వేస్తారు. తరువాత వివరాలు చెప్పిన వ్యక్తి నుంచి ఈకేవైసీ వేయించుకుంటారు. కాగా, ఈకేవైసీకి ముందు ఏమైనా తప్పులు ఉంటే సరి చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.

ఏర్పాట్లు పూర్తి

కులగణన కోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మాస్టర్ ట్రైనర్లతో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు నవంబర్ నెలలోనే శిక్షణ తరగతులు నిర్వహించారు. కుల గణనలో ఎలాంటి తప్పులు దొర్లకుండా కుటుంబ సభ్యుల వివరాలను యాప్‌లో సులభంగా నమోదు చేయడంపై శిక్షణలో ప్రధానంగా అవగాహన కల్పించారు. ఎన్యుమరేటర్లను సమన్వయం చేసేందుకు మూడు, నాలుగు గ్రామాలకు ఒక సూపర్ వైజర్‌ను నియమించారు. కులగణనపై ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు నవంబర్ 17వ తేదీన కర్నూలులో రీజినల్ సదస్సును నిర్వహించారు.



కులగణనపై నిర్వహించిన రీజినల్ సదస్సుకు హాజరైన కుల సంఘాల నాయకులు, ప్రజలు (ఫైల్)

రెండు వారాల్లో తేలనున్న లెక్కలు..

బీసీలతోపాటు ఇతర కులాల లెక్కలు కేవలం రెండు వారాల్లో తేల్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కర్నూలు జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 4.66 లక్షల కుటుంబాలు ఉన్నాయి. ఆయా కుటుంబాల్లో 22.72 లక్షల మంది ఉన్నారు. అందులో పురుషులు 11.42 లక్షలు, స్త్రీలు 11.30 లక్షల మంది ఉన్నారు. ఈ క్రమంలో సమగ్ర కులగణనను రెండు వారాల్లో పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జనవరి 19 నుంచి 28వ తేదీ వరకు పది రోజులపాటు ఎన్యుమరేటర్లుగా ఉన్న సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి వారి వారి కుటుంబాల వివరాలను సమగ్రంగా సేకరిస్తారు. కుటుంబంలోని ప్రతి వ్యక్తి పేరు, ఆధార్ నంబర్, అడ్రస్, పంచాయతీ, మండలం, జిల్లా పేర్లను తీసుకుంటారు. అలాగే ఆ కుటుంబంలో సభ్యుల సంఖ్య, వారు నివాస ఉండే ఇంటి వివరాలు, వారికి పశువులు ఉంటే వాటి సంఖ్య, ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ వాడుతున్నారా లేదా కట్టెల పొయ్యి వినియోగంలో ఉందా? కులం, చదువు, వృత్తి, వారికి ఉన్న భూముల వివరాలను సమగ్రంగా సేకరిస్తారు. జనవరి 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు చేపట్టే పది రోజుల సర్వేలో తీసుకోలేకపోయిన వారి వివరాలను జనవరి 29 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు సేకరిస్తారు. ఫిబ్రవరి 3 నుంచి 15వ తేదీ వరకు సేకరించిన వివరాలను పరిశీలించి కుల గణన వివరాలను విడుదల చేస్తారు.

కులగణనలో పాల్గొననున్న సిబ్బంది
ఎన్యుమరేటర్లు: 10,395
సూపర్‌వైజర్లు: 2,757

ప్రతి ఒక్కరూ సహకరించాలి



కులగణనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇచ్చాం. ప్రతి ఒక్కరూ గణనకు సహకరించాలి. ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదు. కులగణనతో సంక్షేమ పథకాల నుంచి తొలగిస్తారని చెప్పడం అసత్యం. కేవలం కులాల జనాభాను తెలుసుకోవడానికి కుల గణనను ప్రభుత్వం చేపడుతోంది. సర్వేకు వెళ్లిన సమయంలో ఎన్యుమరేటర్లు సమగ్రంగా కుటుంబాల వివరాలు సేకరించాలి.

– డాక్టర్ జి.సృజన, జిల్లాకలెక్టర్

చట్టసభల్లో బీసీలకు న్యాయం జరుగుతుంది



93 ఏళ్ల తరువాత కులగణన చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న సాహసోపేత నిర్ణయం ఇది. గతంలో ఎంతో మంది బీసీలను మోసం చేశారు. వారికి న్యాయం చేయాలన్న ఉద్దేశంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల గణనకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సర్వే పూర్తి అయితే చట్టసభల్లో బీసీలకు న్యాయం జరుగుతుంది.

–బీవై రామయ్య, వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు

శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం

- శ్రీశైల ఆలయ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి

శ్రీశైలంటెంపుల్: జిల్లా యంత్రాంగం సహాయ సహకారాలతో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేస్తామని శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి అన్నారు. శ్రీశైల మహాక్షేత్రంలో మార్చి 1వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణపై గురువారం దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రపాణిరెడ్డి, ఈఓ పెద్దిరాజు ప్రాథమిక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ దేవస్థానం అన్ని విభాగాల ఉద్యోగులు సమన్వయంతో భక్తులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. అనంతరం ఆయా విభాగాల వారీగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాధిపతులకు, పర్యవేక్షకులకు ఏర్పాట్లపై పలు ఆదేశాలు జారీ చేశారు. ఈఓ పెద్దిరాజు మాట్లాడుతూ వైదిక సిబ్బంది, ఆలయ విభాగాధికారులు పరస్పర సమన్వయంతో ఉత్సవాల్లో జరిగే ఆయా కైంకర్యాలలను సంప్రదాయబద్ధంగా జరిపించాలన్నారు. ప్రతి విభాగం కూడా ఏర్పాట్లపై ప్రణాళిక రూపొందించి సమర్పించాలన్నారు. పాదయాత్రగా వచ్చే భక్తుల సౌకర్యార్థం నాగలూటి, పెద్దచెరువు, భీమునికొలను, కైలాసద్వారం, సాక్షిగణపతి మొదలైన చోట్ల ఏర్పాట్లు గురించి చర్చించారు. అటవీశాఖ వారి సహకారంతో నడకదారిలో వచ్చే భక్తులకు ఆయా ఏర్పాట్లును కల్పించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా శివదీక్షా భక్తులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు, జ్యోతిర్ముడి సమర్పణకు చేయాల్సిన ఏర్పాట్లు మొదలైన వాటిని గురించి పలు ఆదేశాలు జారీ చేశారు. బ్రహ్మోత్సవాల్లో వాహనాల ట్రాఫిక్ జాం కాకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావును కోరారు. పాతాళగంగ మెట్ల మార్గంలో అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, క్షేత్ర పరిధిలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆలయ అధికారులను ఆదేశించారు. సమావేశంలో స్థానిక డిప్యూటీ తహసీల్దార్ ఎం.కిషోర్‌కుమార్, శ్రీశైలం సీఐ ఎం.దివాకర్‌రెడ్డి, వన్‌టౌన్, టు టౌన్ ఎస్‌ఐలు లక్షణ్‌రావు, గంగయ్య యాదవ్, మండల ప్రాథమిక వైద్యశాల డాక్టర్లు వాణి, సహనాజ్, సీహెచ్‌ఓ రామారావు, దేవస్థానం ఆయా విభాగాల పర్యవేక్షకులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో పాల్గొన్న చైర్మన్ చక్రపాణిరెడ్డి, ఈఓ పెద్దిరాజు తదితరులు

సంగమేశ్వరంలో చలువ పందిళ్ల ఏర్పాటు

కొత్తపల్లి: సప్తనది సంగమ తీరంలో వెలసిన ప్రాచీన పుణ్యక్షేత్రం సంగమేశ్వరాలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు ఏర్పాట్లు చేశారు. సంగమేశ్వరుడు 8 నెలలు జలాధివాసంలో ఉండగా నాలుగు నెలలు మాత్రమే భక్తులకు దర్శన భాగ్యం ఉంటుంది. ఈ నాలుగు నెలల్లో ఆలయాన్ని సందర్శించేందుకు దేశ నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారు. ఈ సమయంలో వేసవి తాపం నుంచి భక్తులకు విముక్తి కలిగించేందుకు ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ గురువారం ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేయించారు. అదేవిధంగా భక్తులు స్నానాలు ఆచరించేందుకు వాటర్ ట్యాంకులు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు, మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు.



సంగమేశ్వరాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలువపందిళ్లు

20 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర స్థాయి కబడ్డీ జూనియర్ చాంపియన్‌షిప్ – 2024 పోటీలు నంద్యాలలో ఈనెల 20వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి కర్నూలు జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ ఏపీ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 23వ తేదీ జరిగే ఈ పోటీల్లో 13 జిల్లాల నుంచి దాదాపు 450 మంది బాలబాలికలు పాల్గొంటున్నట్లు వివరించారు. హాజరయ్యే క్రీడాకారులకు స్థానిక గురురాజ విద్యాసంస్థల చైర్మన్ దస్తగిరి కుమారులు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డిలు భోజన వసతి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వసతి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. నాలుగు రోజుల పాటు ఫ్లడ్ లైట్ల వెలుతురులో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో జాయింట్ సెక్రటరీ సుబ్రమణ్యం, వైస్ ప్రెసిడెంట్‌లు నాగరాజు, రామేశ్వరరెడ్డి, సురేష్ నాయుడు, ఎంఈఓ రమణారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, కబడ్డీ కోచ్ సురేష్, కబడ్డీ మెంబర్స్ మహబూబ్‌బాషా, కిశోర్ పాల్గొన్నారు.

ట్యాంకర్ ఢీకొని వృద్ధుడి దుర్మరణం

- రెండు నెలల వ్యవధిలో రోడ్డు ప్రమాదంలో కుమారుడు, తండ్రి మృత్యువాత



మృతి చెందిన మద్దిలేటి (ఫైల్)

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల – బనగానపల్లె ఆర్‌అండ్‌బీ రహదారిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. అమడాల గ్రామానికి చెందిన నిచ్చెనమెట్ల మద్దిలేటి (67) టీవీఎస్ లూనాపై కోవెలకుంట్లకు వెళ్లి మనవళ్లకు అరటి పండ్లు తీసుకొని తిరుగు ప్రయాణమయ్యాడు. అమడాల మెట్ట వద్ద ఊర్లోకి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా కోవెలకుంట్ల నుంచి వస్తున్న ఫ్లయాస్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మద్దిలేటి ట్యాంకర్ టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. కాగా రెండు నెలల క్రితం కోవెలకుంట్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్ద కుమారుడు బాలమద్దయ్య మృతి చెందాడు. రెండు నెలల వ్యవధిలోనే తండ్రి, కుమారుడిని రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోవెలకుంట్ల ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అహోబిలేశుడికి నీరాజనం



బాచేపల్లిలో ఊరేగుతున్న ఉత్సవ పల్లకీ

ఆళ్లగడ్డ: పార్వేట మహోత్సవాల్లో భాగంగా గ్రామ గ్రామాన విశేష పూజలందుకునేందుకు కొండదిగిన అహోబిలేశుడికి భక్తులు నీరాజనం పడుతున్నారు. గురువారం రూరల్ మండలం బాచేపల్లి గ్రామంలో ఉత్సవ పల్లకీలో కొలువై విహరిస్తున్న ప్రహ్లాదవరద స్వామి, జ్వాలనరసింహ స్వామికి భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పశు బీమా నమోదు ప్రారంభం

నంద్యాల(సెంట్రల్): జిల్లాలోని పాడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. వైఎస్సార్ పశు నష్ట పరిహారం కింద బీమా నమోదును ప్రారంభించినట్లు జిల్లా పశువర్ధక శాఖ అధికారి గోవింద నాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నంద్యాల, ఆళ్లగడ్డ డివిజన్లకు సంబంధించి మొత్తం 29 మండలాల్లో 2,500 పశువులకు ఈ విడతలో బీమా చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించిందని పేర్కొన్నారు. ఒక కుటుంబానికి 5 పశువులు, 50 జీవాల వరకు బీమా వర్తిస్తుందన్నారు. పదేళ్ల పైబడిన ఎద్దులు, దున్నలు, 6 నెలల లోపు గొర్రెలు మేకలు, పందులకు బీమా వర్తించదన్నారు. రూ.30 వేల విలువచేసే పశువులకు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మూడు సంవత్సరాల కాల వ్యవధికి రూ.384, ఇతరులకు రూ.960గా ప్రీమియాన్ని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వివరాలకు 1962ను సంప్రదించాలన్నారు.

సీడ్ ప్లాంట్లలో విజిలెన్స్ తనిఖీలు



నాణ్యతా పరీక్షలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

నంద్యాల(అర్బన్): పట్టణ శివారుల్లోని పత్తి విత్తన శుద్ధి కేంద్రాల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ అధికారులు కేశవరెడ్డి, రామకృష్ణా రెడ్డి, విజిలెన్స్ వ్యవసాయాధికారి రూఫస్‌లు మండల వ్యవసాయాధికారి ప్రసాదరావుతో కలిసి స్థానిక శ్రావణ లక్ష్మీసీడ్స్, ఆర్కే సీడ్స్ ఆగ్రో ఇండస్ట్రీస్ విత్తన శుద్ధి కేంద్రాల్లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రావణ లక్ష్మీసీడ్స్ విత్తనశుద్ధి కేంద్రంలో ఆరు లాట్లలో హెచ్‌టీ కాటన్ స్ట్రిప్ టెస్టు నిర్వహించగా అందులో హెచ్‌టీ నెగిటివ్‌గా వచ్చింది. అనంతరం విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ పత్తి వ్యవసాయ శాఖ ద్వారా అనుమతులు పొందిన కంపెనీల విత్తనాలను ప్రాసెసింగ్ చేయాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు పొందిన తర్వాతనే విత్తశుద్ధి చేయాలన్నారు. విత్త శుద్ధి కేంద్రానికి సంబంధించిన అన్ని రిజిస్టర్లు పక్కాగా ఉండాలని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే విత్తన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి ఆత్మహత్య



బనగానపల్లె రూరల్: నందవరం గ్రామం శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ సమీపంలో గుర్తు తెలియని ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నందివర్గం ఎస్‌ఐ తిరుపాల్ తెలిపిన వివరాల మేరకు.. ఆలయ సమీపంలోని చెట్టుకు సుమారు 60–65 ఏళ్ల వృద్ధుడు ఉరేసుకుని మృతి చెంది ఉండటంతో గురువారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. ప్రకాశం జిల్లా గిద్దలూరుకు ప్రాంతానికి చెందినట్లుగా స్థానిక ఆటో డ్రైవర్లకు చెప్పాడని, మృతుడు ముస్లిం కులస్తుడిగా మృతదేహం వద్ద లభించిన వస్తువులు బట్టి తెలుస్తోందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసిన తెలిసిన 91211 01098కి సమాచారం ఇవ్వాలన్నారు.

ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఐదు డీసీసీబీ బ్రాంచ్‌లు



పగిడ్యాల సొసైటీ చైర్మన్ రామచంద్రారెడ్డిని సత్కరిస్తున్న చైర్‌పర్సన్ విజయ మనోహరి, సీఈఓ రామాంజనేయులు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతనంగా ఐదు శాఖలను ఏర్పాటు చేయనున్నట్లు చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి వెల్లడించారు. ఈ ఐదింటిని కూడా నంద్యాల జిల్లాలో ఏర్పాటు కానున్నాయని స్పష్టం చేశారు. గురువారం పాతబస్తీలోని డీసీసీబీ బ్రాంచి ప్రాంగణంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్యాపిలి మండలంలోని నేరెడుచెర్ల, డోన్ మండలంలోని ఎద్దుపెంట, గోస్పాడు మండలంలోని యాల్లూరు, మండల కేంద్రమైన కొలిమిగుండ్ల, నందవరంలలో నూతన బ్రాంచ్‌లు ఏర్పాటు కానున్నట్లు ప్రకటించారు. వీటి ఏర్పాటుకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా అనుమతి ఇచ్చిందన్నారు. ఈ నెల 8న వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పగిడ్యాల సహకార సంఘం రైతాంగానికి అందిస్తున్న సేవలపై చైర్మన్ రామచంద్రారెడ్డి, సీఈఓ ఖాజామొహిద్దీన్‌లను ప్రశంసించిన నేపథ్యంలో డీసీసీబీ చైర్‌పర్సన్ విజయ మనోహరి, సీఈఓ రామాంజనేయులు వారిని ఘనంగా సత్కరించారు. రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి డీసీసీబీ ఇతోధికంగా కృషి చేస్తుందని, 2023–24లో బ్యాంకును రాష్ట్రంలోనే ఉన్నత బ్యాంకుగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం సవరించిన ఉద్యోగుల సర్వీసు నియమావళిని ఆమోదించారు. ఈ సందర్భంగా 2024 సంవత్సరం క్యాలెండర్‌ను చైర్‌పర్సన్ తదితరులు విడుదల చేశారు. కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు గుండం సూర్యప్రకాష్‌రెడ్డి, వెంకటేశ్వరమ్మ, సీమ సుధాకర్ రెడ్డి, మూలింటి రాఘవేంద్ర, డీసీఓ ఎం.రామాంజనేయులు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి.రామాంజనేయులు, ఆప్కాబ్ జీఎం/ఓఎస్‌డీ విజయకుమార్, ఆప్కాబ్ డీపీడీఎం వహిదా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

22 మంది ఎస్‌ఐలకు స్థానచలనం

కర్నూలు: ఉమ్మడి కర్నూలు జిల్లా పోలీసు శాఖలో బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈనెల చివరి వారం లోగా అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లను పూర్తి చేయాలన్న కేంద్ర ఎన్నికల సంఘం సూచన మేరకు ఉమ్మడి జిల్లా పోలీసు శాఖలో బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ ప్రతిపాదనల మేరకు ఈనెల 4న 13 మంది సీఐలు, 6న 19 మంది ఎస్‌ఐలకు స్థానచలనం కలిగింది. తాజాగా మరో 22 మంది ఎస్‌ఐలకు స్థానచలనం కల్పిస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇందులో భాగంగా స్టేషన్లలో ఉన్న 11 మంది ఎస్‌ఐలు కర్నూలు రేంజ్ వీఆర్‌కు బదిలీ కాగా వీఆర్‌లో ఉన్న పలువురిని స్టేషన్లకు నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీస్థానం
కె.గౌస్ మొహిద్దీన్	సీసీఎస్, నంద్యాల (అటాచ్డ్ పీసీఆర్, నంద్యాల)	వీఆర్, కర్నూలు రేంజ్
డి.మధుసూదన రావు	సీసీఎస్, నంద్యాల (అటాచ్డ్ నంద్యాల ట్రాఫిక్)	వీఆర్, కర్నూలు రేంజ్
పి.సలాం ఖాన్	డీఎస్‌బీ, నంద్యాల (అటాచ్డ్ నంద్యాల ట్రాఫిక్)	వీఆర్, కర్నూలు రేంజ్
జి.రవికుమార్	వీఆర్, నంద్యాల	వీఆర్, కర్నూలు రేంజ్
జి.సురేష్ బాబు	వీఆర్, నంద్యాల (అటాచ్డ్ నందికొట్కూరు)	వీఆర్, కర్నూలు రేంజ్
ఎ.డానియేల్ రాజు	వీఆర్, నంద్యాల (అటాచ్డ్ నంద్యాల త్రీటౌన్)	వీఆర్, కర్నూలు రేంజ్
ఎస్.ఎ.రవూఫ్	సీసీఎస్, నంద్యాల (అటాచ్డ్ కర్నూలు త్రీటౌన్)	వీఆర్, కర్నూలు రేంజ్
కె.నజీర్ హుసేన్	నంద్యాల ట్రాఫిక్	వీఆర్, కర్నూలు రేంజ్
జి.పుల్లయ్య	వీఆర్, నంద్యాల (అటాచ్డ్ నంద్యాల వన్‌టౌన్)	వీఆర్, కర్నూలు రేంజ్
ఆశా బేగం	వీఆర్, నంద్యాల (అటాచ్డ్ కర్నూలు)	వీఆర్, కర్నూలు రేంజ్
ఆర్.శ్రీనివాసులు	సీసీఎస్, నంద్యాల (అటాచ్డ్ డీసీఆర్‌బీ, కర్నూలు)	వీఆర్, కర్నూలు రేంజ్
కె.హరిప్రసాద్	నంద్యాల టూటౌన్	నంద్యాల త్రీటౌన్
జె.రమేష్ కుమార్	డీసీఆర్‌బీ, నంద్యాల	నంద్యాల వన్‌టౌన్
నాగార్జున రెడ్డి	వీఆర్, నంద్యాల	నంద్యాల టూటౌన్
జి.నవీన్ బాబు	వీఆర్, నంద్యాల	నంద్యాల టూటౌన్
కె.వెంకటరెడ్డి	కోవెలకుంట్ల పీఎస్	వీఆర్, నంద్యాల
టి.కల్పన	రేవనూరు పీఎస్	సైబర్ సెల్, నంద్యాల
ఎం.ప్రతాప్	సంజామల పీఎస్	వీఆర్, నంద్యాల
పి.సుబ్బరామిరెడ్డి	నంద్యాల వన్‌టౌన్	వీఆర్, నంద్యాల
జి.వి.నగేష్	దోన్ టౌన్ యూపీఎస్	వీఆర్, నంద్యాల
కె.వి.లక్ష్మయ్య	నంద్యాల ట్రాఫిక్	ఫ్యాక్షన్ జోన్,నంద్యాల
కె.దేవేంద్రకుమార్	వీఆర్, నంద్యాల (అటాచ్డ్ నంద్యాల ట్రాఫిక్)	పీసీఆర్, నంద్యాల

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం



మృతి చెందిన సునీత (ఫైల్)

శ్రీశైలం: శ్రీశైలానికి చెందిన ఓ యువతి గురువారం హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందింది. శ్రీశైల దేవస్థానంలో ప్రొటోకాల్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న మల్లికార్జున సోదరి సునీత(26) ప్రస్తుతం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డులో నివాసముంటోంది. గురువారం స్కూటీపై విధులకు వెళ్తుండగా మార్గమధ్యలో వెనుక నుంచి వాటర్ ట్యాంక్ ఢీకొనడంతో అదుపు తప్పి కింద పడింది. పక్కనే వస్తున్న ఆర్టీసీ బస్సు టైర్లు ఎక్కడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు వివరాలు సేకరించి మృతురాలి కుటుంబీకులకు సమాచారం అందించంతో వారు శ్రీశైలం నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు.